

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# నట్టింట దీపం

తలుపు తీయగానే గుమ్మంలో కొడుకుతో పాటు ప్రత్యక్షమయిన అపరిచితురాలిని చూసి నివ్వెరపోయింది సుశీలమ్మ.

"కొంపదీసి ఈ పిల్లను ఎవరినో పెళ్లి చేసుకొని తీసుకురాలేదు గదా" అనీ అనుకుంది. కుందనపు బొమ్మ లాంటి ఆ అమ్మాయి నిండుగా భుజాలమీదకు పైట కప్పు కుని తలొంచుకొని నిలబడిన తీరు చూస్తే వీడేదో అలాంటి గొప్ప పని చేసినట్లే వున్నాడు అన్న అనుమానము వచ్చింది

శ్రావణ్ నవ్వుతూ అన్నాడు "ఏంటమ్మా గుమ్మానికి అడ్డంగా అలా నిలబడిపోయావు. మమ్మల్ని లోపలికి రానివ్వవా?"

సుశీలమ్మ తేరుకుని వాళ్లకు దారి ఇచ్చింది. లోపలికి వచ్చాక ఆమెను పరిచయం చేసాడు.

"అమ్మా నా కొలీగ్ సరితా అని చెబుతుంటానే .... ఈమె ..."

సరిత నమస్కారం చేసింది.

సుశీలమ్మ తేలికగా గాలి పీల్చుకుంది. "రండి, కూర్చోండి మా వాడు ఆఫీసు విషయాలు చెప్పినప్పుడల్లా మీ గురించి చెబుతుంటాడు." అన్నది.

"ఏమని చెబుతుంటానో అదీ చెప్పు.." అన్నాడు నవ్వుతూ.

"మీరు చాలా మంచివారనీ అందరికీ తలలో నాలుకలా ఉంటారని, ఎవరికి ఏ సాయం కావాలన్నా చేస్తుంటారని మా వాడు చెబుతుంటాడు. ఆమెను ఒకసారి తీసుకురారా అని అడిగాను." అన్నదామె కలుపుగోలుగా.

"ఇది మాత్రం సెంట్ పర్సెంట్ అబద్ధం. నువ్వు సరితను తీసుకురమ్మని ఎప్పుడూ చెప్పలేదు. నా అంతట నేనే తీసుకువచ్చాను. ఆ క్రెడిట్ నాదే.." అన్నాడు శ్రావణ్.

"మిమ్మల్ని చూడాలని అనుకున్నమాట మాత్రం నిజం. తీసుకురమ్మని చెబుతుండగానే ఇవాళ అనుకోకుండా వచ్చారు. చాలా సంతోషం ..." అన్నది సుశీలమ్మ కూడా నవ్వేస్తూ.

"నన్ను మీరు అనకండి. మీ కంటే చాలా చిన్నదాన్ని " అన్నది సరిత.

"నేను వయసులో పెద్దదాన్ని కావచ్చు. కానీ మిగిలిన అన్ని విషయాలలో మీరే పెద్దవాళ్ళు కదా ... గౌరవం పొందవలసిన వాళ్ళు .... "

"అయినా మీరు ఆలా అంటుంటే వినటానికి చాల ఇబ్బందిగా వుంది. నన్ను ఏకవచనంలోనే పిలవండి. నేను మీ అమ్మాయి లాంటి దాన్ని. " అన్నది సరిత.

సరిత చామన చాయగా వున్నా మొహంలో మంచి కళ వుంది. ఆకర్షణ వుంది. విశాలమైన కళ్ళల్లో విలక్షణమైన అందం వుంది.

"విద్య యొసఁగును వినయము అన్నారు. ఎంత చదువుకున్నా చదువు ఒక ఎత్తు. వినయ విధేయతలు ఒక యెత్తు. నువ్వు ఎవరింట కాలు పెడతావో గాని వాళ్ళ ఇంట నట్టింట దీపమై వెలుగు తావు..... " అంటూ సుశీలమ్మ మనసులో మాట పైకి అనేసింది.

"ఇప్పుడు మనింట కాలు పెట్టిందిగదా ...సరితా దీపం అయితే మనకు కరెంటు ఖర్చు ఉండదేమో... " అన్నాడు శ్రావణ్ .

"ఏమిటా వేళాకోళం " అని కొడుకును మందలించింది. "నేను ముహ ప్రీతికోసం అంటున్న మాటలు కావివి. మనస్ఫూర్తిగానే చెబుతూ న్నాను. నువ్వు ఎవరింట కాలు పెట్టిన ఆ ఇంటికే వన్నె తెస్తావు ..."

"చెప్పానుగదా మనింటి ఒక కాలు కాదు రెండు కళ్ళు పెట్టిందని ...సరితా ముందు ఏ కాలు లోపలి పెట్టావు.. కుడి కాలా, ఎడమ కాలా ?" అని సరిత ను అడిగాడు.

"నీ పిచ్చి వాగుడు కట్టిపెట్టమన్నానా ? హాస్యానికైనా సమయం సందర్భం ఉండాలి" అంటూ శ్రావణ్ ను కోప్పడింది. "వాడి మాటలు పట్టించుకోకమ్మా. ఇన్నేళ్లు వచ్చినా ఎవరిముందు ఎలా మాట్లాడాలో కూడా తెలియదు. ఆఫీసులో కూడా ఇలాగె వాగుతుంటాడా ? " అని అడిగింది .

"అయన అంతే. ఆ ధోరణికి మేము అలవాటు పడిపోయాం" అన్నది సరిత చిరునవ్వుతో శ్రావణ్ వంక చూసి .

"చిన్నప్పటినుంచీ వాడంతేనమ్మా.. ముందు వెనకా చూడకుండా నోటికి ఎంత మాట వస్తే అంత మాట అనేస్తాడు" అన్నది కొడుకు మాటలకు ఆమె నొచ్చుకుంటూ.

నిజానికి సరితకు అతని ధోరణి వినసొంపుగానే వున్నా పైకి మాత్రం ఆలా అనేసింది.

"తల్లిదండ్రులకు ఒక్కడే పిల్లా డు ఉంటే గారాబం ఎక్కువై ఇలాగే తయారవుతారని ఎక్కడో చదివానండి. "

"నిజమే వీడికి గారాబం ఎక్కువే " అని అంగీకరించింది సుశీలమ్మ.

"అప్పుడే ఇద్దరూ ఒకటై పోయారన్నమాట " అన్నాడు శ్రావణ్ సరిత వైపు చూస్తూ. ఆమె సిగ్గుతో తల దించుకుంది.

"ఒక్క నిముషం కూర్చో. ఇప్పుడే వస్తాను" అంటూ సుశీలమ్మ వంటింట్లోకి వెళ్ళింది. శ్రావణ్ ఆమె వెనుకే వెళ్ళాడు.

"అమ్మా, ఆ అమ్మాయి ఎలావుందీ ?"

"చెప్పానుగదా . ఆ అమ్మాయి ఎవరింట కాలు పెట్టినా నట్టింట దీపమే నని" అన్నది స్టవ్ వెలిగించి.

"కోడలిని తీసుకురారా, నాకీ చాకిరీ తప్పుతుంది అని అస్తమానము నన్ను పోరు తున్నావుకదమ్మా..నీ కోరిక తీరుద్దామని తీసుకొచ్చాను " అన్నాడు శ్రావణ్ తల్లి వంక చూసి నవ్వుతూ .

సుశీలమ్మ తన చెవులను తాను నమ్మలేక పోయింది. కొడుకు `ఆ అమ్మాయిని వెంట పెట్టుకుని గుమ్మంలో నిలబడినపుడు చెప్పా పెట్టకుండా వీడు కోడలిని వెంటబెట్టుకొచ్చాడేమో అని క్షణ కాలం విస్తు పోయినా అది తన భ్రమే నని తేలిపోవటంతో మనసు తేలిక పడింది. ఇప్పుడు మళ్ళీ కోడలిని తెచ్చానంటుంటే ఆమె పక్కన పిడుగు పడ్డట్లు అనిపిస్తోంది.

"ఏమ్మా? నీ కిష్టంలేదా ?"

"పెళ్లి చేసుకుని పదికాలాల పాటు కాపురం చేయాల్సింది మీరు. మీకు ఇష్టమైతే చాలు..." అన్నది పిండి కలుపుతూ.

"నీకు కోపం వచ్చినట్లుంది ..."

"నీకిష్టమైన అమ్మాయిని ఎన్నుకున్నందుకు, ఆ అమ్మాయిని ఇంటికి తీసుకొచ్చినందుకు కోపం లేదురా .. కానీ ముందుగా నాతో ఓ మాట చెప్పివుంటే బావుండేది. .."

"ఇప్పుడు మాత్రం ఏమైంది ? నీ మాట ఎప్పుడు కాదన్నాను ? " అన్నాడు శ్రావణ్.

అతనికి తల్లి దగ్గర బాగా గారాబం. అయినా చిన్న చిన్న విషయాలకు అలగటం మామూలే.

"సరితా, అక్కడ ఒక్కదానివి ఎం చేస్తావు ? లోపలి రా " అని పిల్చాడు.

సరిత వంటింటి గుమ్మం దాకా వచ్చి "నేను రావచ్చునా " అని అనుమతి అడిగింది.

"రామ్మా రా , ఇంకా పనిమనిషి రాలేదు. వంటింట్లో అన్నీ ఎక్కడివక్కడ వున్నాయి.. నువ్వు జడుసుకుంటావని..." అన్నది సుశీలమ్మ పకోడీలు చేస్తూ .

"పర్వాలేదమ్మా, సరిత కు అలవాటే... షి విల్ మేకిట్ ఏ మెస్ వేరెవర్ షి గోస్ " అన్నాడు శ్రావణ్ సరిత తల మీద చిన్నగా మొట్టి .

"డోంట్ సే లైక్ దట్. యు విల్ మేకిట్ ఏ మెస్ అండ్ ఐ హావ్ టు సెటిట్ రైట్ ..."

వాళ్ళు ఇద్దరు ఇంగ్లీషు లో ఏదో మాట్లాడుకుంటుంటే వీళ్ళ వైపే చూస్తున్న సుశీలమ్మ చేతిమీద కాలుతున్న నూనె చింది పడింది. ఆమె "అబ్బా" అనగానే సరిత ఒక్క ఉదుటున వెళ్లి ఆమెను పట్టుకుంది.

ఒకపక్క బాధగా వున్నా కాబోయే కోడలు వచ్చి తనను పట్టుకున్నందుకు ఆమె మనసు ఆనందంతో నిండిపోయింది. సరిత ఆమెను పక్కకు తప్పుకోమని ఆమె చేతిలోని పని అందుకుంది. ఎన్నాళ్ళనుంచో ఊహించు కుంటున్న దృశ్యం ఇది. కోడలు వస్తే వంట పని తప్పుతుందన్న కోరిక అప్పుడే తీరుతోంది.

పది నిముషాల తరువాత టిఫిన్ తింటూ సుశీలమ్మ అన్నది "నువ్వే నయం. వుద్యోగం చేస్తూకూడా వంట పని నేర్చుకున్నావు. మా అమ్మాయికి కాఫీ పెట్టటం గూడా రాదు. "

"మీ అమ్మాయి ఇంట్లో లేనట్లుంది ?"

"కాలేజీకి వెళ్ళింది. వచ్చేవేళ అయింది "

కాలింగ్ బెల్లు మోగింది.

గౌరీనాధశాస్త్రి వచ్చాడు. సుశీలమ్మ లేచి ఆయనతో పాటు లోపలికి వెళ్ళింది. సరిత కూడా లేచి నిలబడింది.

"మా అమ్మతో దోస్తీ కలిపేసావుకదా ... మా నాన్నతో కూడా ఫ్రెండ్షిప్ కలిపేస్తే పని అయిపోతుంది. .." అన్నాడు శ్రావణ్ సరితతో రహస్యంగా.

వాళ్ళు హాల్లోకి వచ్చారు. గౌరినాధశాస్త్రిది నిండైన విగ్రహం. ఇంతలేసి కళ్ళతో తీక్షణంగా చూసాడు.

"నాన్నా, ఈమె నా కొలీగ్ ... సరితా రెడ్డి ..."

సరిత ఆయనకు నమస్కారం చేసింది.

"చిన్నదానివి గనుక ఆశీర్వదిస్తాను. దీర్ఘాయుష్మాన్ భవ .. " అన్నాడాయన

"షి ఈజ్ వెరీ ఇంటెలిజెంట్ .. " అని శ్రావణ్ ఏదో చెప్పబోయాడు.

"ప్రపంచంలో ప్రతివాళ్ళూ నీకన్నా ఇంటిలిజెంటే ...నువ్వే ఎందుకూ పనికి రావు " అన్నాడాయన పెద్దరికాన్ని వహిస్తూ. కొంచెం కోపం చూపిస్తూ.

సరితకు అయన దూకుడు చూసి భయం వేసింది. సుశీలమ్మ అడ్డు పడింది. "ఎందుకండీ వాడిని ఆలా ఆడిపోసుకుంటారు ?" అంటూ .

అసలు విషయంలోకి రాక ముందే గొడవపడటం ఇష్టం లేక శ్రావణ్ ఊరుకున్నాడు. కొద్దిసేపు ఆగి మళ్ళీ మొదలెట్టాడు.

"మేము ఇద్దరమూ ఒకే రోజు ఉద్యోగంలో జేరాము . ఒకే చోట పోస్టు చేశారు . మేము క్లోజుగా వుండటంచూసి మేము పెళ్లి చేసుకోబోతున్నట్లు అందరూ అనుకుంటున్నారు. మాకూ అదే ఐడియా వచ్చింది. మీ అభిప్రాయంకోసం వచ్చాము ." అన్నాడు శ్రావణ్.

"ఏడవలేకపోయావ్.. మతిలేని వెధవలు సవాలక్ష అనుకుంటారు. మీకు బుద్ధి ఉండక్కర్లా ? ...ఒకే ఆఫీసులో పని చేస్తుంటే పెళ్లి చేసుకోవాలని వుందా ? మీ గురించి అందరు అనుకునేదాకా వచ్చిందంటే మీ ప్రవర్తన అంత దరిద్రంగా ఉందన్నమాట .."

"తప్పేముంది ? మీరు పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు గదా పెళ్లి చేసుకున్నాక పెళ్ళాన్ని ప్రేమించక తప్పదు.. అలాంటపుడు ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే తప్పేముంది ? " అని అడిగాడు శ్రావణ్.

"తెలివిలేకుండా మాట్లాడకు. పెళ్లి అంటే వెనకా ముందూ కులాలు గోత్రాలు ఎన్నో చూడాలి " అన్నాడాయన నిష్కర్షగా.

"ఏం అక్కర్లేదు .."

"మాకు కావాలి..." ఖంగున మ్రోగింది అయన కంఠం.

"పెళ్లి చేసుకునేది నేను.. నా ఇష్టం వచ్చిన వాళ్ళను చేసుకుంటాను ..."

"చేసుకోరా.. నాకు ఇంత విషం ఇచ్చి నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో ..." అన్నాడాయన ఉగ్రుడై.

"ఏమిటండీ ఆ మాటలు " అంటూ సుశీల సర్ది చెప్పబోయింది.

"నువ్వు నోరుమూయ్.. నీ వల్లనే ఇదంతా ..." అని భార్యను విసుక్కుని సరిత వైపు తిరిగాడు "ఏమ్మా, మీ వాళ్ళు నిన్ను ఆఫీసుకు పంపిస్తున్నది ఆఫీసులో పనిచేసి రావటానికా, ప్రేమాయణం సాగించటానికా ?" అని అడిగాడు. సరిత తల దించుకుంది.

"మీరు అనదల్చుకుంటే నన్ను అనండి... అనవసరంగా ఆమెను ఏమి అనకండి.."అన్నాడు శ్రావణ్ తండ్రితో.

"ఇప్పటినుంచే ఇలా వెనకేసుకొస్తే నాలుగు రోజులు పోయాక నీ మొహం కూడా చూడదు. .." అన్నాడు అయన.

ఇప్పటిదాకా మౌనంగా వున్న సరిత కలుగ జేసుకుంది. "పెద్దవారు.... కోపంగా వున్నారు మీరు అనవచ్చు మేము పడవచ్చు కానీ ఒకటి మాత్రం చెప్ప దల్చుకున్నాను మీ అభిప్రాయాలూ సరియైనవని మీరు అనుకున్నట్లుగానే, మా అభిప్రాయాలు సరైనవని మేం అనుకుంటున్నాము . కనుక ఒకరినొకరు నిందించుకుని ప్రయోజనం లేదు..." అన్నది.

కులాలు వేరు కావటమే కాదు. ప్రేమ వివాహాలు సక్సెస్ కావని అయన నమ్మకం. అదే చెప్పారు.

సరిత సెలవు తీసుకుని బయట పడింది. ఆమెను సాగనంపటా నికి వచ్చిన శ్రావణ్ ఆమెకు 'సారీ ' చెప్పాడు.

"ముందే అనుకున్నాం గదా .. అయన ఒప్పుకోరని ..." అన్నది సరిత.

"ఇప్పుడేం చేద్దాం ?" అని అడిగాడు శ్రావణ్.

"ఇవాళ ఉన్న కోపమే ఎల్లకాలం ఉండదు. కొంతకాలం ఆగుదాం.." అన్నది సరిత.

అదే మంచిదనిపించింది శ్రావణ్ కు.

ఆ రాత్రికి సుశీలమ్మ భర్తను అడిగింది "ఎందుకంత కఠినంగా మాట్లాడారు ? ఆ అమ్మాయి నచ్చలేదా ? " అని.

"ఆ అమ్మాయి నచ్చకపోవటం ఒక్కటే కాదు. ప్రేమలో పడిన వాళ్ళు వ్యామోహంలోపడి కొట్టుకుపోతుంటారు.. ఎవరేం చెప్పినా వినిపించుకోరు. పెళ్లి అయ్యాక రెండేళ్లు పోయాక ఆ వ్యామోహం తగ్గి పోతుంది. గొడవలు ప్రారంభం అవుతాయి. ప్రేమ వివాహాలు ఫెయిల్ అయ్యేది ఇందుకే. ఇప్పుడు పార్కుల చుట్టూ తిరిగిన వాళ్ళు, రేపు కోర్టుల చుట్టూ తిరుగుతారు. ఆ ప్రమాదాన్ని నివారించటానికే నేను ఇంట కఠినంగా మాట్లాడ వల్సివచ్చింది. .." అన్నాడాయన.

సుశీలమ్మ మర్నాడే ఫోన్ చేసి సరిత కు అయన అభిప్రాయం చెప్పింది.

"నేను ఇదివరకే చెప్పాను. మీ అభిప్రాయాలూ మీకు సరైనవని మీకు అనిపించవచ్చు. కానీ మా అభిప్రాయాలూ మాకు మంచివని అనిపిస్తాయి. ఏది ఎంత వరకు నిజమో కాలమే నిర్ణయిస్తుంది. .." అన్నది సరిత.

★★★ ★★★ ★★★

ఏడాది గడిచింది.

శ్రావణ్, గౌరినాధ శాస్త్రి ఒకే ఒరలో నున్న రెండు కత్తుల్లా వున్నారు. మాట్లాడుకోవటం లేదు మొహాలు చూసుకోవటం లేదు శ్రావణ్ అన్నిటికి మౌనవ్రతమే అవలంబిస్తున్నాడు అది సుశీలమ్మకు మరింత బాధాకరంగా వుంది. కొడుకు కట్నంతో కూతురు పెళ్లి చేయాలన్న ఆలోచనలో వున్న భార్య భర్తల కిద్దరికీ, కొడుకు పెళ్లి చేసుకోను అని భీష్మించుకుని కూర్చోవటం తలనొప్పిగా మారింది. అయన కూతురి పెళ్ళికి తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నాడు .

కొన్నేళ్ల కిందట ఎప్పుడో తన తమ్ముడికి, బావమరిదికి ఇచ్చిన అయిదారు లక్షలు రాబట్టుకోవాలని చూసాడు. ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తాం అంటూనే వున్నారు. మంచి సంబంధం వచ్చిందని కుదుర్చుకుని, ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు. కానీ ముహూర్తం దగ్గర పడుతున్నకొద్దీ, ఆదుర్దా పెరిగిపోతోంది.

మీరు ముహూర్తాలు పెట్టుకోండి మేం రెండు రోజుల్లో డబ్బు తెచ్చిస్తామని భరోసా ఇచ్చినవాళ్లు మొహం చాటుచేయటంతో, గౌరినాధశాస్త్రికి, సుశీలమ్మకు దిక్కు తోచటం లేదు. గౌరినాధశాస్త్రి పిచ్చిపట్టినవాడిలా తిరుగుతున్నాడు. అందర్నీ తిడుతున్నాడు. తనని తాను తిట్టుకుంటున్నాడు. కొడుకు మీద దుమ్మెత్తి పోస్తున్నాడు. "దీనికంతటికి కారణం నువ్వే నంటూ " కొడుకు మీద శివాలెత్తి పోతున్నాడు.

సుశీలమ్మకు ఏమి తోచడంలేదు. చివరి ప్రయత్నంగా సరితకు ఫోన్ చేసి విషయమంతా చెప్పింది.

"మా వాడి మీద పెట్టుకున్న ఆశలన్నీ అడియాసలయ్యాయి. మా దగ్గర వాళ్ళ అవసరాలకి డబ్బు తీసుకున్నవాళ్ళూ చావు దెబ్బ కొట్టారు. అందరూ అన్నివిధాలుగా మమ్మల్ని నట్టేట ముంచేశారు . ముహూర్తం వారం రోజులు కూడా లేదు. ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్నట్లుగ వుంది. ఈ పెళ్లి సంగతి ఏమోగాని, అయన పరిస్థితి చూస్తుంటే, నాకు కడుపు తరుక్కు పోతోంది. అసలే గుండె జబ్బు మనిషి. టెన్షన్ పెట్టుకోవద్దంటూ డాక్టర్లు చెబుతున్నారు. అయన ఏమయిపోతాడో నన్న దిగులు ఎక్కువై పోయింది. .." అని తన బాధ అంతా వెళ్లబోసుకుంది.

"నన్నేం చెయ్యమంటారు ?" అని అడిగింది సరిత.

"మాకున్న ఆశ మా కొడుకు ఒక్కడే. వాడూ మాకు దూరమైపోయాడు. నువ్వయినా వాడికి నచ్చ చెప్పి ఏదో విధంగా అయిదారు లక్ష లన్నా పోగుచేసి ఇస్తే పెళ్లి అయిందనిపిస్తాం. ఇంక నీదే భారం" అని చెప్పుకుంది సుశీలమ్మ.

"మేము ఉద్యోగంలో చేరి నిండా రెండేళ్లు కాలేదు. మాకు అప్పు ఎక్కడ దొరుకుతుంది. ఒక పని చేస్తాను. మా నాన్న నా పెళ్లి కోసం పది లక్షలు ఫిక్స్డ్ డిపాజిట్ లో వేసివుంచాడు. ఆయనకు చెప్పి చూస్తాను ---" అన్నది సరిత.

ఆ మాటలు సుశీలమ్మకు చీకట్లో చిరుదీపంలా కనిపించాయి. "చిన్నదానివయినా నీకు చేతులెత్తి దండం పెడతాను. ఈ గండం గట్టెక్కిచ్చు తల్లి---" అన్నది.

"తప్పు అత్తయ్య గారూ ---. . మీరు పెద్దవారు. ఆలా అనకండి." అన్నది సరిత.

మరునాడు సరిత డబ్బు తీసుకెళ్లి గౌరినాథశాస్త్రికి అందించింది.

"మీ అభిప్రాయాలే సరియైనవని ఇప్పుడు తెల్సుకున్నానమ్మా ---. మీ ఇంటికొచ్చి మీ నాన్నగారికి శుభ లేఖ ఇవ్వాలి అయన పేరు చెప్పు తల్లీ ---" అన్నాడు గౌరినాథశాస్త్రి .

"డాక్టర్ నరసింహారెడ్డి ......."

"డాక్టర్ నరసింహారెడ్డి --- అయన ఏ హాస్పిటల్లో పనిచేస్తున్నారమ్మా ?" అని అడిగాడు .

సరిత చెప్పింది.

"అయిదేళ్ల కిందట అయన నాకు ఆపరేషన్ చేసి నా ప్రాణం కాపాడారు. అప్పుడు ఆరిపోతున్న ఈ దీపానికి చేతులు అడ్డం పెట్టి ఆదుకున్నారు. ఇప్పుడు నువ్వు ఇంకోసారి నా ప్రాణం పోకుండా ఆదుకున్నావు. ---" అన్నది అయన కన్నీళ్లు తుడుచుకుంటూ.

"ఊరుకోండి మామయ్యా ---" అన్నది సరిత.

"పూరుకుంటానమ్మా--- నట్టింట దీపం లాగా నువ్వు మా ఇంట్లో ఉంటే నాకు ఇంక దిగులేం వుంది.." అన్నాడు గౌరినాథ శాస్త్రి.

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.